అంబరాన్నంటిన సంబురాలు

- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- కేక్‌లు కట్ చేసిన యువత
- ఇళ్ల ముంగిన రంగవల్లులు తీర్చిదిద్దిన మహిళలు

2023 ఏడాదికి వీడ్కోలు పలుకుతూ 2024కు స్వాగతం చెబుతూ అన్ని వర్గాల ప్రజలు సంబురాలు నిర్వహించారు. డిసెంబర్ 31 అర్ధరాత్రి నుంచే వేడుకలను ప్రారంభించారు. యువత కేక్‌లు కట్ చేసి, మిఠాయిలు పంచుకున్నారు. అందరూ ఒక్కచోట చేరి డీజేలు ఏర్పాటు చేసి నృత్యాలు చేశారు. పలు హోటళ్లు, ఇతర సంస్థలు నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశాయి. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఈ కార్యక్రమాలు కొనసాగాయి. పలు వసతిగృహాల్లోనూ వేడుకలు నిర్వహించారు. ఇక మహిళలు తెల్లవారుజామున ఇళ్ల ఎదుట రంగవల్లులు తీర్చిదిద్దారు. వివిధ రంగులను అద్ది ఆకట్టుకునేలా ముగ్గులను వేశారు. అందులోనూ నూతన సంవత్సర శుభాకాంక్షలు అని రాసి ఆకట్టుకున్నారు. క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే, ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా శివాలయాలు తెల్లవారుజాము నుంచే కిటకిటలాడాయి. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించగా.. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు.

-సాక్షి నెట్‌వర్క్


బూర్గంపాడు: మోరంపల్లిబంజరలో..


ఓ ఇంటి ఎదుట వేసిన ముగ్గు


కరకగూడెం: కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


అన్నపురెడ్డిపల్లి: శివాలయంలో భక్తుల పూజలు


అశ్వారావుపేటరూరల్: మైనార్టీ గురుకుల పాఠశాలలో కేక్ కట్ చేసిన విద్యార్థినులు


చంద్రుగొండ: గానుగపాడు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మహిళలు


అశ్వారావుపేటరూరల్: తిరుమలకుంట గ్రామంలో..


అశ్వాపురం: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


అశ్వారావుపేటరూరల్: దిబ్బగూడెం చర్చిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు


చర్ల: చర్చిలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం


చంద్రుగొండ: రంగులు అద్దుతున్న చిన్నారి

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


మాట్లాడుతున్న విజయ్‌కుమార్, పక్కన కృష్ణకాంత్

అశ్వారావుపేటరూరల్: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) నూతన సుపరింటెండెంట్‌గా రెగ్యులర్ వైద్యులు విజయ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఆస్పత్రిలో బాధ్యతలు నిర్వర్తించిన డాక్టర్ పూర్ణచంద్ సెలవుపై వెళ్లడంతో ఉన్నతాధికారులు తనకు బాధ్యతలు అప్పగించారన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స శిబిరాలను నిర్వహిస్తామని, గర్భిణులకు కూడా శస్త్రచికిత్స చేస్తామని తెలిపారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 30 పడకల సౌకర్యంతోపాటు డయాలసిస్ అందుబాటులో ఉందని, పాముకాటు, పురుగులమందు తాగిన కేసులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సమావేశంలో ఆర్ఎంఓ డాక్టర్ కృష్ణకాంత్, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే

మణుగూరురూరల్: ఇటీవల జరిగిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కరాటే విద్యార్థులను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అభినందించారు. న్యూ ఇయర్ సందర్భంగా కరాటే మాస్టర్ కాశీమల్ల పద్మ, విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బ్లాక్ బెల్ట్‌లో జక్కుల యామిని, బ్రౌన్ బెల్ట్‌లో రాయల పల్లవి, గుగులోత్ రిషిక, మిధునశ్రీ, ఆరెంజ్ బెల్ట్‌లో గుగులోత్ ధృవిక, ఎల్లో బెల్ట్‌లో కోవిద్ సాయి, రిశ్విన్, జ్ఞానేశ్, నిఖిల్, జొన్నలగడ్డ వేదాంశ్‌చౌదరి, విష్ణువర్ధన్‌రెడ్డి, చతుర్వేద్, హన్సీ, ప్రద్యుమ్న రేయాన్స్, గుగులోత్ వర్షిణి, చక్రేశ్ ప్రతిభ చాటారు.

మెజిస్ట్రేట్‌కు శుభాకాంక్షలు తెలిపిన న్యాయవాదులు

మణుగూరురూరల్: న్యూ ఇయర్ సందర్భంగా మణుగూరు ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ కోర్టు మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లును న్యాయవాదులు సోమవారం కోర్ట్ హాల్లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, చిర్ర రవి, కందిమళ్ల నర్సింహారావు, పోశం భాస్కర్, జాడి చొక్కారావు, పద్మావతి, కవిత, లావణ్య, శైలజ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న వెంకటేశ్వరరెడ్డి

మణుగూరురూరల్: శ్రీమంత్‌రెడ్డి ఎడ్యుకేషనల్, వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. శ్రీమంత్‌రెడ్డి తొమ్మిదో వర్ధంతి సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి సమితి సింగారం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన బెల్లం బుల్లెమ్మ – రాజబాబు మనువరాళ్లు సుస్మిత, నిఖిత, సంకీర్తనతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న దివ్యాంగ విద్యార్థి పర్శిక రాజుకు రూ.3 వేల చొప్పున అందించారు. బుల్లెమ్మ కుటుంబానికి 25 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో అప్పారావు, సుబ్బారెడ్డి, రమణకుమార్, రామిరెడ్డి, శామ్యూల్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి


బియ్యం అందజేస్తున్న దుర్గ, రవి

కరకగూడెం: పేదలకు సేవ చేయడంలోనే తృప్తి లభిస్తుందని మణుగూరు జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు పాల్వంచ దుర్గ, సామాజిక కార్యకర్త కర్నె రవి పేర్కొన్నారు. మండలంలోని నర్సంపేటకాలనీ వాసి దొడ్డి సూర్యం పూరిల్లు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోవడంతో సోమవారం వారు 50 కేజీల బియ్యంతో పాటు నిత్యావసరాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సూర్యం కుటుంబాన్ని ప్రభుత్వం కూడా ఆదుకోవాలని కోరారు.

నేడు గ్రామసభలు

దమ్మపేట/అశ్వాపురం/దుమ్ముగూడెం: దమ్మపేట మండలంలోని దమ్మపేట, మల్కారం, మందలపల్లి, పట్వారిగూడెం, తొట్టిపంపు గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, అశ్వాపురం మండలం మొండికుంటలో ప్రజాపాలన గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నరేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, దుమ్ముగూడెం మండలంలో కోయనర్సాపురం, గౌరారం, పెదనల్లబల్లి, నారాయణరావుపేట, ప్రగళ్లపల్లి, దుమ్ముగూడెం గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలోని ప్రజలు, దరఖాస్తులను నింపి, గ్రామసభల్లోని కౌంటర్లలో అందజేసి, రశీదు పొందాలని అధికారులు సూచించారు. ఇంతకు ముందు పింఛన్ పొందుతున్న వారు అందుకు సంబంధించిన దరఖాస్తు ఇవ్వాల్సిన అవసరం లేదని వారు స్పష్టం చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి

గుండాల: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాల అమలు కోసం ఏర్పాటు చేయనున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు బొబ్బిలి పవన్ కల్యాణ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా ప్రభుత్వం అందించిన దరఖాస్తులను పూర్తి చేసి, కావాల్సిన ధ్రువపత్రాల నకళ్లను జతపరిచి, గ్రామసభల్లో అందించాలని కోరారు.

నేడు గ్రామసభకు ఎమ్మెల్యే

కరకగూడెం: మండలంలోని చిరుమళ్ల గ్రామ పంచాయతీలో మంగళవారం నిర్వహించనున్న ప్రజాపాలన గ్రామసభలో ఉదయం 10 గంటలకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొననున్నారని ఎంపీడీఓ శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీ ఎన్నిక

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని హరిత హోటల్‌లో సోమవారం ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లింగాల శ్రీహరికుమార్, ఉపాధ్యక్షుడిగా పానుగంటి ఈశ్వర్, ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్‌యాదవ్, సహాయ కార్యదర్శిగా వనమా శివ, కోశాధికారిగా జిల్లా శ్రీనివాస్, ముఖ్య సలహాదారుడిగా రెడిన్ రమేశ్‌ను ఎన్నుకున్నారు. నూతన కమిటీని పలువురు అభినందించారు.

మంత్రి పొంగులేటిని కలిసిన నాయకులు


చంద్రుగొండ: మంత్రి పొంగులేటికి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

చంద్రుగొండ: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణను మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కల్లూరు మండలం నారాయణపురంలో మంత్రి పొంగులేటిని, గండుగులపల్లిలో జారే ఆదినారాయణను కలిశారు. భోజ్యా నాయక్, సారేపల్లి శేఖర్, కృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ చెవుల చందర్‌రావు, ఉప్పతల ఏడుకొండలు, బానోత్ రాముడు తదితరులు ఉన్నారు.

మంత్రులకు శుభాకాంక్షలు

చర్ల: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సోమవారం చర్ల మండలానికి చెందిన పలువురు కాగ్రెస్ నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సీతారామచంద్రస్వామి వారి తీర్థ ప్రసాదాలను అందించారు. తుమ్మల నాగేశ్వరావును ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో కలవగా పొంగులేటి శ్రీనివాసరెడ్డిని నారాయణపురంలో కలిశారు. బాలసాని లక్ష్మీనారాయణ, మువ్వా విజయబాబు, తుళ్లూరి బ్రహ్మయ్యను సైతం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

టీఎన్‌టీయూసీ క్యాలెండర్లు ఆవిష్కరణ


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మొహంతి

బూర్గంపాడు: సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ గుర్తింపు కార్మిక సంఘం టీఎన్‌టీయూసీ 2024 నూతన క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ హెడ్ సిద్ధార్థ మొహంతి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐటీసీ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) శ్యామ్‌కిరణ్, మరడాన శ్రీనివాస్, బాషా, టీఎన్‌టీయూసీ చైర్మన్ గల్లా నాగభూషణం, గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు కనకమేడల హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి గాదె రామకోటిరెడ్డి, అజీజ్, జీవన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, బషారత్ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ శ్రీరాముడి అక్షింతలు


బూర్గంపాడు: అక్షింతలతో తీర్థ క్షేత్ర ట్రస్ట్ బాధ్యులు


భద్రాచలంటౌన్: శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం


చర్ల: శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

బూర్గంపాడు: అయోధ్య శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరామ స్పర్శ అక్షింతలు, కరపత్రాలను సోమవారం సారపాకలో గడపగడపకూ పంపిణీ చేశారు. సారపాకలోని సాకేతపురి ఆంజనేయస్వామి మందిరం వద్ద నుంచి నాలుగు బృందాలు ఈ అక్షింతల పంపిణీ కార్యక్రమం చేపట్టాయి. తీర్థ క్షేత్ర మండల ప్రముఖ్ పీసపాటి నాగభూషణ్‌శాస్త్రి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో సాయికుమార్ శర్మ, అనిల్, గోవర్ధన్, రాంప్రసాద్, శ్రీనివాసరెడ్డి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో శోభాయాత్ర

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో అయోధ్య అక్షింతల శోభాయాత్రను విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్, బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీసీతారామచంద్ర స్వామివారి ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో అక్షింతలకు కలశ పూజ నిర్వహించారు. అనంతరం తాతగుడి ఆంజనేయ స్వామివారి ఆలయం నుంచి ప్రారంభించిన యాత్ర పట్టణంలోని పలుకాలనీల్లో సాగింది.

చర్లలో..

చర్ల: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలతో ఆదివారం చర్లలో శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. పెట్రోల్‌బంక్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం నంచి ప్రారంభమైన ఈ శోభాయాత్ర బస్టాండ్ సెంటర్, గాంధీ సెంటర్, పాత చర్ల, పోలీస్ స్టేషన్ సెంటర్, తహసీల్దార్ కార్యాలయంతోపాటు పలు ప్రధాన వీధుల్లో యాత్ర సాగింది. అర్చకులు, ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్, విశ్వ హిందూ పరిషత్ బాధ్యులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు ప్రశంసాపత్రాలు


ప్రశంసాపత్రాలు అందుకున్న కానిస్టేబుళ్లతో ఆలయ ఈఓ రమాదేవి

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కానిస్టేబుళ్లకు ఆలయ ఈఓ రమాదేవి సోమవారం ప్రశంసాపత్రాలు అందజేశారు. దేవస్థానంలో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న గుంజ శ్రీను, వీరేంద్రనాథ్, రాజేశ్, దరీందర్, రామకృష్ణను సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఐఎంఏ నూతన కమిటీ ఎన్నిక

భద్రాచలంటౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఎన్నికల కమిటీ సభ్యులు డాక్టర్ ఎల్.కాంతారావు, డాక్టర్ సుబ్బరాజు, డాక్టర్ సుదర్శన్‌రావు ఆధ్వర్యాన కమిటీని ఎన్నుకోగా వివరాలను వెల్లడించారు. ఐఎంఏ భద్రాచలం శాఖ అధ్యక్షుడిగా ఏ.మోహన్‌రావు, ఉపాధ్యక్షులుగా జయభారతి, రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, కోశాధికారిగా సురేష్ కుమార్, జాయింట్ సెక్రటరీలుగా రమేష్ చంద్ర, స్పందన ఎన్నికయ్యారు. ఈ మేరకు నూతన కార్యవర్గానికి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్, ఏఎస్పీ పరితోష్ పంకజ్ తదితరులు అభినందనలు తెలిపారు.

సింగరేణి డైరెక్టర్లకు శుభాకాంక్షలు

సింగరేణి(కొత్తగూడెం): నూతన సంవత్సరం సందర్భంగా కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలోని డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎన్వీకే శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి, జీఎంలు హన్మంతరావు, బసవయ్య, జక్కం రమేశ్‌తో పాటు ఇతర అధికారులు పలువురు సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగూడెంలోని వారి కార్యాలయాల్లో డైరెక్టర్లు, అధికారులను సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అంతోటి నాగేశ్వరరావు ఆధ్వర్యాన పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. కొత్తగూడెం ఏరియాలో కొంతకాలం కిందట సర్వే చేసి నిలిపేసిన రాంపురం, పెనగడప ఓసీతోపాటు వీకే–7 షాఫ్ట్ గని అనుమతులు ఈ ఏడాది సాధించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు జిమ్మిడి మల్లేశ్, బందెల విజేందర్, మోరే రమేశ్‌కుమార్, మీసాల శ్రీహరి, వంగపండ్ల సుమన్, విక్టర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వెంకటేశ్వర్లుకు సన్మానం


మణుగూరురూరల్: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే


అశ్వాపురం: ఎమ్మెల్యేను సత్కరిస్తున్న నాయకులు

మణుగూరురూరల్/అశ్వాపురం: పినపాక నియోజకవర్గంలోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, ప్రముఖులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పి సత్కరించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు, పూలమొక్కలు అందించారు. డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీలు కేవీ రావు, ముత్తినేని సుజాత, వేములపల్లి రమేశ్, సదర్‌లాల్, ఎస్‌కే ఖదిర్, ఓరుగంటి రమేశ్, బూరెడ్డి వెంకటరెడ్డి, తూము పెద వీరరాఘవులు, సురకంటి వెంకటరమణారెడ్డి, రాగం మల్లయ్య, వెంకటరమణ, వలబోజు మురళీకృష్ణ, బొబ్బాల నాగేశ్వరరావు, పొడియం అనిల్, సుజాత, పుచ్చకాయల శంకర్, మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు, సీఐలు రమాకాంత్, రవీందర్, శివప్రసాద్, ఎస్ఐలు రాజేశ్, శ్రీనివాస్, సురేశ్‌కుమార్, తిరుపతిరావు, ఎఫ్ఆర్‌ఓలు ద్వాలియా, ఎస్.రమేశ్, డీఆర్‌ఓలు బి.శంకర్, వీరబాబు, వెంకటేశ్వర్లు, ఎఫ్‌బీఓలు రమేశ్, బాబూరావు, పీఆర్ఏఈ చక్రధరాచారి, దోసపాటి పిచ్చేశ్వరరావు ఆయన్ను కలిసినవారిలో ఉన్నారు.

ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణను మర్యాదపూర్వకంగా కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం మండలంలోని గండుగులపల్లి గ్రామంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసిన వారు ఆయన్ను సత్కరించారు. కాగా, గ్రామంలోని షేకేము ప్రార్థన మందిరం, దమ్మపేటలోని క్రీస్తు సంఘం ప్రార్థన మందిరాల్లో నిర్వహించిన ప్రార్థనలకు ఎమ్మెల్యే ఆదినారాయణ హాజరయ్యారు. అనంతరం చర్చి పెద్దల సహకారంతో పేద మహిళలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేశ్, చిన్నశెట్టి యుగంధర్, భోజ్యానాయక్, అత్తులూరి వెంకటరామారావు, కక్కిరాల రమేశ్, పగడాల రాంబాబు, రావు రవిశంకర్, దామర్ల గోపిశాస్త్రి, చక్కిరాల మల్లేశ్వరరావు, రొయ్యల కుమార్, పెదబాబు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తికి పాటుపడాలి


మాట్లాడుతున్న జీఎం రామచందర్

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా కార్మికులు నూతనోత్సాహంతో రక్షణ సూత్రాలు పాటిస్తూ ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని ఏరియా జీఎం దుర్గం రామచందర్ పిలుపునిచ్చారు. సోమవారం ఏరియాలోని పీకేఓసీ–2లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం రామచందర్ మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ పురోభివృద్ధికి ప్రతి కార్మికుడు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. ప్రతి కార్మికుడికి రక్షణ అనేది ఎంతో ముఖ్యమైనదని, రక్షణతో కూడిన ఉత్పత్తి కోసం శ్రమించాలని సూచించారు. అనంతరం పూర్తిస్థాయి యంత్ర సామర్థ్యాన్ని వినియోగించుకుని ప్రథమస్థానంలో నిలిచిన పీకేఓసీ కార్మికులకు రోలింగ్ షీల్డ్‌ను బహుమతిగా అందజేశారు. అనంతరం రక్షణ అధికారి లింగబాబు అధికారులు, కార్మికులు, సూపర్‌వైజర్లతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీకేఓసీ ప్రాజెక్ట్ అధికారి లక్ష్మీపతిగౌడ్, ప్రాజెక్ట్ ఇంజనీర్ వీరభద్రుడు, ప్రాజెక్ట్ మేనేజర్ రాంబాబు, ఓసీ – 2 మేనేజర్లు సురేశ్, శ్రీనివాస్, సీనియర్ పీఓ ఎండీ మదార్‌సాహెబ్, గుర్తింపు సంఘం నాయకులు రాంగోపాల్, ప్రాతినిధ్య సంఘం నాయకులు వెలగపల్లి జాన్, అధికారులు శంకర్, కల్యాణ్‌రామభాంగ్య, శ్రీనివాస్, రాజశేఖర్, రాందాస్, కృష్ణమూర్తి, రామారావు పాల్గొన్నారు.